

- పత్తి రైతు మెడకు సీసీఐ కొత్త మెలిక
- పంట కొనుగోళ్లలో పరిమితి కుదింపు
- దిగుబడి అంచనాల తగ్గింపుతో అన్నదాతకు నష్టం
- కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతులు
- ఇప్పటికే కపాస్ కిసాన్ యాప్‌తో ఇబ్బందులు



ఎకరాకు ఏడు క్వింటాళ్లే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల కష్టాలు వర్ణనాతీ తంగా మారాయి. అతివృష్టి, అనావృష్టిని తట్టుకొని పంటను కాపాడుకున్న పత్తి అమ్ముకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో పత్తి రైతులు అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు నష్టాన్ని చవి చూడగా, పంట చేతికొచ్చే దశలో మొంథా తుఫాన్ కూడా కలవరపెట్టి పోయింది. మిగిలిన పత్తి దిగుబడిపై ఆశలు పెంచుకున్న రైతులకు నిబంధనల కత్తి మెడపై వేలాడుతోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకుని మద్దతు ధర పొందవచ్చని ఆశపడ్డ నిరాశ మిగిలింది. సీసీఐ కొనుగోళ్లలో కొర్రీలు పెడుతుండడంతో రైతులు మళ్లీ దళారులే దిక్కా అనే అయోమయ పరిస్థితిలో పడ్డారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రోజుకో నిబంధనలతో రైతులను ఇబ్బందులపాలు చేస్తోంది. ఇప్పటి దాకా కపాస్ కిసాన్ యాప్‌లో నమోదైన పంటకు మాత్రమే కొంటామని మెలికపెట్టగా తాజాగా ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటామని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు సీసీఐ కేంద్రాల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు పత్తిని అమ్ముకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం ఐదు క్వింటాళ్లు తగ్గించింది. తేమ, నాణ్యత పేరిట పెట్టే కొర్రిలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొత్త నిబంధన శాపంగా మారింది. దిగుబడి ఎక్కువ వచ్చిన రైతులు తప్పని పరిస్థితుల్లో దళారులు, ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● 38 లక్షల క్వింటాళ్ల దిగుబడి..

జిల్లాలో ఈ ఏడాది సాగు చేసిన పత్తి విస్తీర్ణంలో 38 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్క ప్రకారం సీసీఐ జిల్లా వ్యాప్తంగా 24 సీసీఐ కొనుగోలు కేంద్రాలను జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసేందుకు నోటిఫై చేశారు. ఈ మేరకు గురువారం నుంచి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టనుంది. ఈ ఏడాది రైతులు పత్తి అమ్ముకునేందుకు స్లాట్ బుకింగ్ పద్ధతి అమలు చేస్తున్నారు. ఏ రైతు అయితే తమ పత్తిని సీసీఐ కేంద్రంలో అమ్ముకోవాలని అనుకుంటాడో అంతకు రెండు, మూడు రోజుల ముందు ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకోవాలి. ఈ విధానం వల్ల రైతులు సీసీఐ కేంద్రాల వద్ద వేచి చూసే అవసరం ఉండదు.

● రోజుకో నిబంధన..

సీసీఐ రోజుకో నిబంధన తీసుకురావడం వల్ల రై తులు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 3.30 లక్షల ఎకరాలు పత్తి వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికల్లో వెల్లడిం చారు. కాగా అకాల వర్షాలు, మొంథా తుఫాన్ వరదలతో పత్తికి భారీగా నష్టం వాటిల్లింది. జిల్లా లో సుమారు 10వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అకాల వర్షాల వల్ల ఎకరాకు దిగుబడి తగ్గితే 8 క్వింటాళ్లుగా వ స్తుందని ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలో ఈ ఏడాది 38 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుం దని ఉన్నతా ధికారులు ఇచ్చిన నివేదికల ఆధారం గా 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చే యాలని రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ఇచ్చింది. ఇప్పుడు 7 క్వింటాళ్లు అని సీసీఐ ప్రకటించడంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి లేఖ రాశారు. దీంతో పాటు అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని 20 శాతం తేమ ఉన్నా సీసీఐ కొనుగోలు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని లేని పక్షంలో 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొను గోళ్లు నిలిపి వేస్తామని తెలంగాణ జిన్నింగ్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకటించింది.

సీసీఐ సర్వే చేసి తగ్గించింది..

- అశ్వాక్ అహ్మద్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి



సీసీఐ అధికారులు ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుమతి చేసుకునేలా సాఫ్ట్‌వేర్‌లో పొందు పరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ అధికా రులు సర్వే చేసి గతంలో ఉన్న 12 క్వింటాళ్ల దిగుబడిని ఏడు క్వింటాళ్లుగా తేల్చారు. ఈ మేరకు ఈసారి కపాస్ కిసాన్ యాప్‌తో ఏడు క్వింటాళ్ల వరకే స్లాట్ బుకింగ్ అవుతుంది

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు డోంగ్రి ఇషాంత్, నాగోసే మహేష్, జాడి సంజయ్, మౌల్కర్ మహేష్‌లు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొనడానికి వెళ్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా తరపున నుంచి అద్భుతమైన ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో దీపక్ తివారి, పాఠశాలల క్రీడల సమాఖ్య కార్యదర్శి వెంకటేష్, వైస ప్రిన్సిపాల్ రహీం, పీడీ యాదగిరి, పీఈటీ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

తనిఖీ చేసి..రికార్డులు పరిశీలించి..



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా మేనేజర్ మెరుగు నరేష్

సిర్పూర్(యు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల 108,102 అత్యవసర సేవల అంబులెన్స్‌లను బుధవారం జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. 108,102 అత్యవసర అంబులెన్స్‌లో ఉన్న మందులు, మెడికల్ పరికాలు, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. అంబులెన్స్‌కు కాల్ వచ్చి వెంటనే సకాలంలో చేరుకోవాలని సూచించారు. అంబులెన్స్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టెక్నిషియన్‌లు రామేశ్వరి,సేడ్మకి హిరాజీ, అంబులెన్స్ పైలట్ సదత్ గణి, సాయినాథ్, సేడ్మకి గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 నెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ వెంకటేశం, ప్రిన్సిపాల్ మహేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆటగాళ్లు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

గురునానక్‌కు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

వాంకిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిక్కుల మత గురువు గురునానక్ జయంతిని పురస్కరించుకుని బుధవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం జైత్వాన్ బుద్ధ విహార్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ నాయకులు అశోక్, దుర్గాజీ, శ్యాంరావు, రాజేశ్వర్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి ఎమ్మెల్యే విరాళం

సిర్పూర్(టి), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు రూ.11,111 విరాళంగా అందజేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామ ప్రజలకు బీజేపీ నాయకులు నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

దహెగాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖర్జీ గ్రామ యువత బుధవారం గుడుంబా ప్యాకెట్లు తరలిస్తున్న మర్రిపల్లి గ్రామానికి చెందిన వినోద్‌ను ద్విచక్ర వాహనంతో పాటు పటుకున్నారు. దీంతో పాటు ఖర్జీ గ్రామంలోని సీహెచ్ నారాయణ అనే వ్యక్తి పత్తి చేనులో గుడుంబా తయారు చేస్తుండగా పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు.. పోలీసులు ఇద్దరితో పాటు గుడుంబా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఫోన్‌లో ఎస్సై విక్రమ్‌ను సంప్రదించగా వినోద్‌తో పాటు ద్విచక్ర వాహనం, గుడుంబా ప్యాకెట్లు, ఖర్జీ గ్రామానికి చెందిన నారాయణను ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

దీపారాధన..తులసి పూజలు

● జిల్లాలో కార్తీక పౌర్ణమి శోభ ● వెల్లివిరిసిన భక్తిభావం ● కిటకిటలాడిన ఆలయాలు



ఆసిఫాబాద్ పెద్దవాగులో దీపాలు వదులుతున్న మహిళలు



వాంకిడి చికిలి వాగులో దీపాలు వదులుతున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్/వాంకిడి/పెంచికలపేట/రెబ్బెన/బెజ్జూరు/కెరమెరి/దహెగాం/సిర్పూర్(యు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మహిళలు దీపారాధన, తులసి పూజలు నిర్వహించారు. తులసి మొక్కను పూజించడం వల్ల లక్ష్మీదేవి ఇంట్లో నివాసం ఉంటుందని, దీపారాధన చేయడం ద్వారా దుష్టశక్తులు దూరమవుతాయని భావిస్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శివాలయాల్లో పౌర్ణమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఊరంతా కార్తీక పౌర్ణమి సందడి కనిపించింది. తెల్లవారుజామునే జిల్లా కేంద్రంలోని శివాలయాల్లోకి వెళ్లి అభిషేకాలు, క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు, తులసి పూజలు, నోములను భక్తులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆలయాలకు. తెల్లవారు జాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు పట్టణ సమీపంలని పెద్దవాగులో పుణ్యస్నానా లు ఆచరించి ఆలయంలో భక్తి శ్రద్ధలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వెలుపల కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని ఆర్యవైశ్యులు దేవుడి చిత్రపటాలతో వాసవి ఆలయం నుంచి పలు వీధుల గుండా నగర సంకీర్తన నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వాంకిడి మండల కేంద్రంలోని శివాలయం, హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు నిర్వహించారు. మహిళలు తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించి చికిలి నదిలో వది లారు. పెంచికలపేట మండలంలోని పలు శైవక్షేత్రాలు, రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాల యంలో దీపాలు వెలిగించారు. అలాగే ఇళ్ల వద్ద తులసి, ఉసిరిక చెట్లకు పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో కనక దుర్గాదేవి స్వయంభు శ్రీ మహంకాళి దేవస్థానంలో అమ్మవారికి, కాల భైరవ స్వామికి, అరుణాచల శివుడికి, కనీశ్వరస్వామికి, గర్భగుడిలో ఉన్న మహంకాళి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీపారాధన చేసి ఉసిరి దీపాలతో హరతులిచ్చి నైవేద్యాలు సమర్పించారు. బెజ్జూరు మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని రంగనాయక శివాలయం, హనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయాల్లో ఉసిరక, తులసీ మొక్కలకు వత్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కెరమెరి మండల కేంద్రంలోని శివాలయంలో వేదపండితులు బాపుదేవ్ కులకర్ణి ప్రత్యేక పూజలు చేపట్టారు. గోయగాం గ్రామంలోని శివాలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు శంకర్ మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో ప్రత్యేక తులసీ పూజలు చేపట్టి సమీప జలాశయాల్లో, వాగుల్లో దీపాలు వదిలారు. దహెగాం. మండలంలో ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులతో సందరడి నెలకొన్నది. మండలంలోని శివకేశవాలయం, అయినం శివపంచాయతన క్షేత్రం, లగ్గాం ఉమాచంద్రశేఖర ఆలయంలో భక్తులు తులసి, ఉసిరిక చెట్లకుప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. సిర్పూర్(యు) మండలంలోని ప్రజలు ఆలయలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో గల గోండు రాజుల కాలం నాటి అతి ప్రాచీనమైన మహదేవ్ ఆలయంలో భక్తులు బుధవారం ఉదయం నుంచే భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లలు, మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.



దహెగాం శివకేశవాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పెంచికలపేటలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బెజ్జూరులో మహిళల సామూహిక పూజలు

బుద్ధ విహార్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న బంతేజీలు

సిర్పూర్(టి), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన ఆవరణలో బుధవారం బుద్ధ విహార్ మందిర్ నిర్మాణానికి నాగ్‌పూర్‌కు చెందిన బంతేజీలు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలో మూడు నెలల నుంచి వర్షావాస్ ముగింపు సందర్భంగా నిర్ణయించి బుద్ధ విహార్ మందిర్ నిర్మాణానికి భూమి పూజ చేశామని అన్నారు. ప్రతి ఒక్కరూ బుద్ధవిహార్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. బుద్ధ విహార్ పూర్తియితే ధ్యానకేంద్రంగా, ఆధ్యాత్మికంగా ఉపయోగపడుతుందని చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు తులసీరాం, రాజు, దేవిదాస్, తిరుపతి, జయంత్, వసంత్, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ ఎన్నికలను అడ్డుకోవడం సరికాదు

కాగజ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ పేపర్‌మిల్లులో కార్మిక సంఘం ఎన్నికలను అడ్డుకునేందుకు హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీఎం యజమాన్యం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యను ఖండిస్తున్నామని సిర్పూర్ పేపర్ మిల్లు ఎంప్లాయిస్ యూనియన్(రి. ఈ-966) వైస్ ప్రసిడెంట్ అంబాల ఓదేలు అన్నారు. స్థానికంగా బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుంచి యూనియన్ ఎన్నికల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఆదిలాబాద్ డీసీఎల్ ఆదేశాల ప్రకారం అన్ని సంఘాలు రికార్డు అందజేసిన నేపథ్యంలో ఎన్నికల అధికారిగా డిప్యూటీ లేబర కమిషనర్‌ను నియమించిందని చెప్పారు. నవంబరులో సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ల అర్హత, అనర్హతల గురించి ప్రశ్నిస్తూ హైకోర్టులో పిటిషన్ వేయడం ప్రజాస్వామ్య ప్రక్రియను అడ్డుకోవడమే అవుతుందని అన్నారు. ఎస్పీఎం యజమాన్యం మొదటి నుంచి ఎన్నికల నిర్వహణను అడ్డుకుంటుందని చెప్పారు. పలు రకాలుగా ఆటంకాలు కలిగిస్తోందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ చట్ట వ్యతిరేక వేతన ఒప్పందం చేస్తూ గతంలో కార్మికులు పోరాడి సాధించున్న హక్కులు, సౌకర్యాలను రద్దు చేసిందన్నారు. కార్మిక సంఘాల సీక్రెట బ్యాలెట్ ఎన్నికల్లో ఏ యూనియన్‌కు అర్హత ఉంది, ఏ యూనియన్‌కు లేదు అని నిర్ణయించే అధికారం జేకే పేపర్ మిల్లు యజమాన్యానికి ఎక్కడిదని ప్రశ్నించారు. అది లేబర్ డిపార్టుమెంట్ పని అన్నారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు హైకోర్టులో పిటిషన్ వేసి లేబర డిపార్టుమెంట్‌ను తన పని తాను చేయకుండా జోక్యం చేసుకోవడం నిబంధనల ఉల్లంఘనే అని చెప్పారు. ఎస్పీఎం యజమాన్యం హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కౌంటర్ ఇవ్వడానికి యూనియన్ తగిన రీతిలో స్పందించి రిప్రజెంటేషన్ చేస్తుందని చెప్పారు. కేసు ఇంప్లీడు అవుతామని కచ్చితంగా ఎన్నికలు జరిగి తీరుతాయని తెలిపారు. దీని కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో నాయకులు కన్నయ్య, రాగులయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ మూతపడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

రెబ్బెన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్ మూసి వేయకుండా చూడాలని హెచ్‌ఎంఎస్ నాయకులు బుధవారం జీఎం విజభాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో వంద సంవత్సరాలకు సరిపడా అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని చెప్పారు. గోలేటి వర్క్ షాప్‌కు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గోలే టి భూగర్భ, ఉపరితల గనులకు అనేక రకాలుగా ఉపయోగపడ్డ ఏరియా వర్క్‌షాప్ మూసి వేసే విధంగా ఏఐటీయూసీ నాయకులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, ఇనూస్, రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొనాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పలువురు కోరారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 7న తలపెట్టిన నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు మృతి చెందిన విశ్రాంత ఉద్యోగులకు సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణగౌడ్, నాయకులు సిరాజ్, వెంకన్న, కృష్ణాజీ, వరలక్ష్మి, సూరు, గోవర్ధన్, గౌరక్క, సత్య మ్మ, వెంకటేష్, ప్రభాకర్, శ్యాంరావు, శంకర్, పద్మ, లింగయ్య, తుకారాం, వెంక టేశ్వర్లు, లక్ష్మిబాయి, బొజ్జుబాయి, రాంబాబు, భీంరావు, శ్రీనివాస్, కుమార్‌స్వామి, రామారావు, అచ్యుత్‌రావు, పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తుల అరెస్టు

బెల్లంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాళ్లగురిజాల ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బూదకలాన్ గ్రామంలో గణేష్ నిమజ్జన సమయంలో గొడవకు పాల్పడుతున్నారని కొందరు వ్యక్తులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దీంతో కానిస్టేబుల్ శివశంకర్, హెడ్ కానిస్టేబుల్ శివక్రిష్ణ అక్కడికి వెళ్లారు. గొడవ పడుతున్న ఇరువర్గాల వ్యక్తులను కానిస్టేబుళ్లు సముదాయించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఒక్కసారిగా చింతకుంట్ల గణేష్, చింతకుంట్ల మహేశ్ కానిస్టేబుళ్లను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడి పారిపోయారు. అప్పటి నుంచి దాడికి పాల్పడిన వారిని గాలిస్తుండగా బుధవారం బూదకలాన్‌లోని వారి ఇంట్లో ఉన్నారనే సమాచారం రావడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

కోటపల్లి మొదటి ఎంపీపీ అనారోగ్యంతో మృతి


మధుసూదన్ (ఫైల్)

కోటపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి మండల మొదటి ఎంపీపీ రేగళ్ల మధుసూదన్ (83) బుధవారం మృతిచెం దాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. స్వర్గీయ నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మండల వ్యవస్థను తీసుకువచ్చిన సమయంలో కోటపల్లి మండలానికి మొదటి ఎంపీపీగా ఆయన ఎన్నికయ్యారు. కోటపల్లి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన వ్యక్తిగా ఆయనకు పేరుంది. మాజీ మంత్రి బోడ జనార్దన్‌ను రాజకీయంలోకి తీసుకువచ్చి ఎమ్మెల్యేగా గెలిపించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కు మార్‌కు రాజకీయ గురువుగా పేరొందారు. కొంతకాలం తర్వాత ఆయన చెన్నూరులో స్థిరపడి అక్కడ పలు పదవులు అలంక రించారు. ముధుసూదన్ మృతి చెందారన్న విషయం తెలుసు కున్న పలువురు కోటపల్లి నుంచి చెన్నూరుకు తరలివెళ్లారు.

కడుపు నొప్పితో బాలుడి మృతి


వర్షిత్ సాయి(ఫైల్)

నెన్నెల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవడం గ్రామానికి చెందిన బేతు వర్షిత్ సాయి (14) బుధవారం కడుపునొప్పితో మృతి చెందాడు. ఆరోగ్యంగా ఉన్న బాలుడు హఠాత్తుగా మృతి చెందడంతో మృతుడి తండ్రి కుమార్ నెన్నెల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వర్షిత్‌సాయి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం స్కూలు ముగిసినాక స్థానికంగా ఉండే అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ చికెన్ కూరతో బగార రైస్ తిని ఇంటికి వచ్చాడు. ఇంట్లో మరోసారి పప్పుతో భోంచేశాడు. బుధవారం ఉదయం మూడు గంటల సమయంలో కడుపునొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పాడు. వారు స్థానికంగా ఓ ఆర్‌ఎంపీకి చూయించారు. అతడి సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. అక్కడి ప్రైవేటు ఆసుపత్రి డాక్టర్లు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని, కరీంనగర్ తీసుకెళ్లాలని సిఫారసు చేశారు. అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఫుడ్ పాయిజన్ అయిందా.. మరేదైనా కారణంతో మృతి చెందాడా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వస్తున్న సింగరేణి కార్మికుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట ప్రదీప్ కుమార్ (27) గాయపడ్డాడు. మంచిర్యాలకు చెందిన అడ్రియాల ప్రాజెక్టులో బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం తన ద్విచక్రవాహనంపై గనికి వస్తున్న క్రమంలో సుందిల్ల మూల మలుపు వద్ద మంథని నుండి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవాలకు టీకా రక్ష

- గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకా
- రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యుల సూచన


పవర్‌గూడలో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

జైనూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశువులు, గొర్రెలు, మేకలు, మొదలగు జంతువులకు సంక్రమించే వైరస్ వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ముఖ్యమైనది, ఈ వ్యాధి సోకితే నోటికి, గిట్టలకు పుళ్లవుతాయి. ఇది సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని అధికారులు చెబుతున్నారు. గాలి, ఇతర మార్గాల్లో ఇది సంక్రమిస్తుంది. మరణాల శాతం తక్కువైనప్పటికీ ఉత్పాదక శక్తి తగ్గి రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుంది. జిల్లాలో వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం ద్వారా రైతులు ఆదనపు ఆదాయం గడిస్తున్నారు.

ఈ క్రమంలో పశువులు రోగాల బారిన పడి పోషకులు నష్ట పోకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండుసార్లు గాలి కుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు గత నెల రెండో తేదీ నుంచి ఈ నెల 14వ తేదీ వరకు టీకా వేయించే కార్యక్రమానికి పంశు సంవర్ధక శాక శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా 2030 నాటికి గాలి కుంటు వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో కేంద్రం ముందుకెళ్తోంది.

వ్యాధి లక్షణాలు ఇలా..

గాలికుంటు వ్యాధి లక్షణాలు గొర్రెలు, మేకల్లో కన్నా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 104- 106 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. నోటిలో చర్మపు పొరలు, పళ్ల చిగుళ్లు, నాలుక, లోపలి ప్రాంతాల్లో బొబ్బలు పొక్కి చితకడం వల్ల పశువులు మేత తినవు. నోటి నుంచి చొంగ, నురుగు విపరీతంగా కారుతుంది. గిట్టల మధ్య గిట్టపైన బొబ్బలు ఏర్పడి చితికి పుళ్లవుతాయి. నొప్పి వల్ల పశువులు నడిచే సమయంలో కుంటు తాయి. చను మొనలపై కూడా బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు కనిపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగితే దూడలు మరణిస్తాయి. దుక్కిటి పశువులు వ్యవసాయ పనులకు ఉపయోగపడవు, చూలి పశువులకు గర్భస్రావలవుతాయి. పశువులు రక్తహీనతకు గురై శ్వాస కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ, ఎండ వేడిమికి తట్టుకోలేక నీర సించిపోతాయి. ఇవి గమనిస్తే వ్యాధి లక్షణాలు ఉన్న పశువులను ఇతర వాటి నుంచి వేరు చేసి చికిత్స అందించాలి.

ఆరు నెలలకొకసారి..

కేంద్ర సర్కారు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేస్తోంది. నాలుగు నెలల వయస్సు దాటిని ఆవులు, గేదెలకు ఆరు నెలలకొసారి టీకాలు వేస్తారు. ఈ వ్యాధి సోక డంతో మరణాల సంఖ్య తక్కువగా ఉన్నా.. పశువుల్లో ఉత్పాదక, పునరుత్పత్తి శక్తి సామర్థ్యం కుంటు పడుతుంది. మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. దీంతో పాడి రైతులకు ఆర్థికంగా నష్టం జరుగుతుంది. టీకా ఇప్పిస్తే వ్యాధి సోకకుండా నివారించొచ్చు. పాల ఉత్పత్తి తగకుండా ఉంటుంది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ప్రతి రోజు గ్రామాల వారీగా తిరుగుతు పశువులకు టీకా వేస్తున్నారు. రైతులు తప్పక తమ తమ పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్య సిబ్బంది గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకో వాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు.

గంజాయి కట్టడికి పకడ్బందీ చర్యలు

- మధుకర్, కెరమెరి ఎస్సై



ఆంధ్ర జ్యోతి: గంజాయి కట్టడికి ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఎస్సై : గంజాయి నిర్మూలను ఉక్కు పాదం మోపుతున్నాం. గ్రామాల్లో గంజాయి పండిస్తున్న వారిని గుర్తించి గత జూన్ నుంచి ఇప్పటి వరకు పది కేసులు నమోదు చేశాం. గ్రామాల్లో గంజాయి గురించి సమాచారం అందజేసే వారి పేర్లను గోప్యంగా ఉంచడంతో పాటు తగిన పారితోషికం అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పాఠశాలలు, కళాశాలల్లో బాలికల రక్షణకు ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఎస్సై: పాఠశాలలు, కళాశాలల్లో బాలికల రక్షణ కోసం షీ టీంతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: వార సంత రోజు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎస్సై : వార సంత జరిగే ఆదివారం ఐదుగురు పోలీసు సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: పశువులు రోడ్డు ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి కదా?

ఎస్సై: ఈ విషయమై సంబంధిత గ్రామ కార్యదర్శి, ఎంపీడీఓల దృష్టికి తీసుకు వెళ్లాం. సమస్యకు త్వరలోనే పరిష్కరిస్తాం. పశువుల యజమానులకు నోటీసులు అందజేస్తాం.

- కెరమెరి, (ఆంధ్రజ్యోతి)

పోలీసు స్టేషన్ నుంచి హత్య కేసు నిందితుడి పరార్


నిందితుడు సిడాం వినోద్

రెబ్బెన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం పిట్టగూడలో వృద్ధుడిని మంత్రాలు చేస్తున్నాడనే నేపంతో నాలుగు రోజుల క్రితం హత్య చేసిన నిందితుడు సోమవారం రాత్రి రెబ్బెన సీఐ కార్యాలయం నుంచి పారిపోయాడు. తిర్యాణి మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన హనుమంత రావు(50)ను మంత్రాలు చేస్తున్నాడనే నేపంతో అదే గ్రామానికి చెందిన సిడాం వినోద్ శనివారం రాత్రి గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసు లు వినోద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం రెబ్బెన సర్కిల్ కార్యాలయానికి తరలించారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బహిర్భూమికి వెళుతానని చెప్పడంతో అక్కడ ఉన్న కానిస్టేబుళ్లు బాత్‌రూంకు తీసుకెళ్లారు అక్కడికి చేరుకున్నాక వినోద్ వెంట వచ్చిన పోలీసులను తోసి వేసి భవనం గోడ దూకి బేడీలతోనే పారిపోయాడు. పోలీసులు అతడి ఆచూకీ కోసం చుట్టు పక్కల గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వేళ కావడంతో హంతకుడు పోలీసులకు చిక్కలేదు. మంగళవారం తెల్లవారు జాము నుంచే రెబ్బెన, తిర్యాణి మండలాల్లో నిందితుడి కోసం ముమ్మరంగా గాలించారు. ఈ మేరకు రెబ్బెన పోలీసు స్టేషన్‌కు వెనక వైపు కొంత దూరంలో ఉన్న పత్తి చేనులో నిందితుడికి వేసిన బేడీలు లభించాయి. రొంపల్లి సమీపం లో స్థానికులకు నిందితుడు వినోద్ కనిపించినట్లు స్థానికులు అందించిన సమాచారం మేరకు రొంపల్లి పరిసర ప్రాంతాల్లో రెబ్బెన సీఐ సంజయ్‌తో పాటు తిర్యాణి, రెబ్బెన ఎస్సైలు, సిబ్బంది ఆరా తీస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు కూడా ఆచూకీ లభించలేదు.

ఈసుగాం శివమల్లన్న ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కాగజ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం శివమల్లన్న ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం పూజలు నిర్వహించారు. శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే జ్వాల తోరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగం వద్ద కలెక్టర్ వెంకటేష్ దోత్రే దీపాలను వెలిగించారు.. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుల్ల బ్రిడ్జిపైన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అయ్యప్పభక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై వస్తున్న అయ్యప్పభక్తులను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మానకొండూరు మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన బత్తిని వీరస్వామి, నందికొండ రాంరెడ్డి అయ్యప్పమాల వేసుకోవడానికి బుధవారం ఉదయం లక్షెట్‌పేట సమీపంలోని గూడెం గుట్టకు వెళ్లారు. అక్కడ మాల వేసుకుని వేగురుపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల బ్రిడ్జి మీద కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో వీరస్వామికి, రామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా వీరస్వామికి తలకు తీవ్రగాయాలై, మోకాలు కిందభాగం దెబ్బతినగా, రామిరెడ్డికి కుడికాలు తొంటి విరిగింది. మెరుగైన చికిత్స కోసం వారిని కరీంనగర్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి, ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

కెరమెరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పిరి గ్రామంలో సయ్యద్ హబీబ్ అన్సారీ అనే వ్యక్తి చెందిన ఎద్దు బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పశువుల పాక సమీపంలో విద్యుత్ స్తంభానికి కొన్ని రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను సంబంధిత అధికారులు అమర్చారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిగా ఉన్న సమీపంలో ఎర్త్ రావడంతో ఎద్దు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. తనకు నష్ట పరిహారం అందజేయాలని అధికారులను రైతు కోరాడు.

పశువుల పాక దగ్ధం

వాంకిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సడక్‌గూడ గ్రామానికి చెందిన దుర్వ లక్ష్మణ్‌కు చెందిన పశువుల పాక మంగళవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. పశువుల పాకలో పశువుల దాణా ఉందని, సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు లక్ష్మణ్ తెలిపాడు. అధికారులు ఆదుకోవాలని కోరాడు.

శ్రీరాంపూర్ ఓసీపీ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ యూనియన్ పక్షాన శ్రీరాంపూర్ ఓసీపీ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా ఐలవేని శ్రీనివాస్(హెడ్ ఓవర్‌మెన్) నియమిస్తూ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం ఓసీపీ పీఓ వెంకటేశ్వర్లు, సంక్షేమాధికారి ఓంకారి బాబులకు పరిచయం చేశారు. గతంలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన గొల్లపల్లి రాజ్‌కుమార్‌కు అధికారిగా పదోన్నతి రావడంతో ఈ నియామకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, మైనింగ్ స్టాఫ్ నారాయణ, ఆంజనేయులు, అజయ్, హెచ్‌ఈఎంఎం సెక్షన్ ఇన్‌చార్జి మల్లయ్య, పాషా, తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియాలో బహుమతులు సాధించాలి


బహుమతులు అందజేస్తున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోల్ ఇండియాలో ఫోక్ డ్యాన్స్ విభాగంలో కళాకారులు ప్రథమబహుమతి సాధించాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ పేర్కొన్నారు. బుధవారం సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన కంపెనీ లెవెల్ పోటీల్లో విజేతల బహుమతి ప్రదానోత్సవానికి అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా జరుగుతున్న పోటీల్లో మందమర్రి ఫోక్ డ్యాన్స్‌కళాకారులు మంచి నృత్యం కనబర్చి కోలిండియా పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కోలిండియాలో కూడా మొదటి బహుమతి సాధించి సింగరేణి సత్తాచాటాలన్నారు. సింగరేణి యాజమాన్యం క్రీడాకారులకు, కళాకారులకు పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం ఫోక్ డ్యాన్స్ గ్రూపుకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తీక్, క్రీడల సూపర్‌వైజ ర్‌లు జాన్ వెస్లీ, అశోక్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంపెనీ లెవెల్ సంస్కృతిక పోటీలు

మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న కంపెనీ లెవల్ సంస్కృతిక పోటీలు బుధవారంముగిశాయి. 11 ఏరియాల కార్మిక కళాకారులు పాల్గొని పోటీ పడ్డారు. ఫోక్ డ్యాన్స్ విభాగంలో మందమర్రి బెల్లంపల్లి ఏరియా శ్రీనివాస్ బృందం ప్రథమ విజేతగా నిలిచింది. ఆర్కెస్ట్రా విభాగంలో మణుగూరు కళాకారుల బృందం మొదటి బహుమతి సాధించింది. బుల్‌బుల్‌సితార విభాగంలో మందమర్రికిచెందిన సాధనవేని ప్రభాకర్ బహుమతి సాధించాడు. తబలా విభాగంలో బెల్లంపల్లి ఏరియాకు చెందిన అనిల్ ప్రథమ బహుమతి సాధించాడు. వీరంతా త్వరలో జరిగే కోలిండియా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని అధికారులు పేర్కొన్నారు. అదే విధంగా సింగరేణిలో కమ్యూనికేషన్ సెల్ విభాగంలో రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకలతో రాణించిన విరమణ ఉద్యోగ కళాకారులను ఘనంగా సన్మానించారు. వారి సేవలను జీఎం రాధాకృష్ణ కొనియాడారు.



కోల్ ఇండియా పోటీలకు ఎంపిక

మందమర్రిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న కంపెనీ లెవెల్ సంస్కృతిక పోటీల్లో ఫోక్ డ్యాన్స్ విభాగంలో మందమర్రి కళాకారులు ప్రతిభ చాటి కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం జరిగిన ఈ పోటీల్లో మందమర్రి ఫోక్ డ్యాన్స్ కళాకారులు ప్రతిభ చాటరు. ఎంపికైన కళాకారులను అధికారులు ప్రశంసించారు.

హక్కుల సాధనకు ఆందోళనలు



ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ

మందమర్రిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సింగరేణి వ్యాప్తంగా సమర బేరికి పిలుపునిచ్చామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరలతో మాట్లాడుతూ యాజమాన్యం, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా పోరుబాట చేప ట్టామన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం గురువారం గనులపై ధర్నాలు చేస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలను చెబితే యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. గుర్తింపు సంఘంగా ఉద్యోగులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తాము పనిచేస్తున్నామన్నారు. కార్మికుల సొంతింటి కలను అమలు చేయాలని, మారు పేర్ల మార్పు చేయాలని, మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిక్స్‌పై ఇన్‌కంట్యాక్స్ యాజమాన్యం చెల్లించాలని తదితర డిమాండ్లతో ఆందోళనలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు బీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, రమణ, గాండ్ల సంపత్, రాజేశం, వెంకటేశం, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నూతన యంత్రాలతో అధిక బొగ్గు ఉత్పత్తి


షావల్‌ను ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నూతన యంత్రాలతో అధికంగా బొగ్గును వెలికితీయవచ్చని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నూతన షావల్ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో యంత్రాల వినియోగం పెరిగిందన్నారు. నూతన షావల్ ద్వారా ప్రతి రోజు 8,500 క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెను తొలగించవచ్చని తెలిపారు. సమర్థవంతంగా యంత్రాన్ని వినియోగించి నిర్దేశిత ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని ఆదేశించారు.

భద్రతా ప్రమాణాలపై తనిఖీలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో తీసుకుంటున్న భద్రతా ప్రమాణాలపై 5 స్టార్ రేటింగ్ బృందం సభ్యులు బుధవారం తనిఖీ చేపట్టారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో వారికి ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గనుల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భద్రతా చర్యలు, కార్మిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ గురించి కమిటీ సభ్యులకు వివరించారు. ఆర్కే 6 గని రికార్డులను పరిశీలించారు. యాజమాన్యం తీసుకుంటున్న భద్రతా ప్రమాణాలు, నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగ్‌పూర్ ప్రాంతీయ కార్యాలయం ఓఎస్‌డీ కోల్ కంట్రోల్ ఆఫీసర్ రాజేంద్ర చోలే, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల రక్షణ జీఎంలు రఘుకుమార్, మధుసూదన్, జెన్‌కో జీఎం మోహన్ రావు, వరంగల్ నిట్ ప్రొఫెసర్ శ్రీధర్, కొత్తగూడెం ప్రాంతీయ కార్యాలయం ఓఎస్‌డీ కోల్ కంట్రోల్ ఆఫీసర్ కృష్ణమోహన్ రావు, ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీబత్స, ఇందారం ఓసీపీ పీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

మందమర్రిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బొక్కలగుట్ట గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం కొండ చుట్టూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోవింద నామాలతో స్మరణ చేస్తూ ఋష్య ముఖ పర్వతంపై ఉన్న బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

దండేపల్లి నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం భుక్తి కోసం త్యాగాలు చేసిన అమరుల ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. పార్టీ పిలుపులో భాగంగా ఈనెల 9వరకు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం లింగాపూర్‌లో వేల్పుల రాజమల్లు స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లాల్‌కుమార్ మాట్లాడుతూ పీడిత ప్రజల కోసం అనేక మంది తమ ప్రాణాలు త్యాగం చేశారన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకునేందుకే అమరవీ రుల వారోత్సవాలను నిర్వహిస్తున్నామనానరు. వారి ఆశయాలను కొనసాగించినప్పుడు మాత్రమే వారికి నిజమైన నివాళులర్పించిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు రెడ్డిమల్ల ప్రకాశం, ఏఐకేఎంఎస్ ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శంకరి సత్యం, పిట్టల తిరుపతి, అరుణోదయ జిల్లా నాయకులు రెబ్బనపల్లి కిష్టన్న, ఏఐకేఎంఎస్ నాయకులు మల్లేష్, మున్నా, రామన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

జన్నారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జన్నారం అటవీ డివిజన్‌లోని కలమడుగు బీట్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను అధికారులు బుధవారం పట్టుకున్నారు.

ఇంధన్‌పల్లి ఎఫ్ఆర్‌వో ఆదేశాల మేరకు ఎఫ్ఎస్‌ఓ రాజేశ్వర్‌తో పాటు రవి ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని రేంజ్‌కు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కోవ నవీన్, మాణిక్‌రావు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా..



నడుం బిగించిన యువకులు

గ్రామాల్లో అవగాహన సదస్సులు, ప్రతిజ్ఞలు

తగ్గుముఖం పడుతున్న అమ్మకాలు


బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

వేమనపల్లి, నబంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏరులై పారుతున్న గుడుంబా తయారీకి యువకులు కల్లెం వేస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాలు అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండడం, నిరక్షరాస్యులైన గిరిజన, దళితులు గుడుంబా తాగడానికి బానిసలు అవుతున్నారు. ఇదే అదనుగా భావించిన గుడుంబా వ్యాపారులు సమీప అటవీ ప్రాంతాల్లో గుడుంబా బట్టీలను పెద్ద మొత్తంలో పెట్టి వేల లీటర్ల గుడుంబాను తయారు చేస్తూ గ్రామాల్లోకి సరఫరా చేస్తున్నారు. మండలంలోని సుంపుటం, వేమనపల్లి, నాగారం, లక్ష్మీపూర్, జిల్లెడ, బుయ్యారం, బద్దెంపల్లి, సూరారం, మంగెనపల్లి తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో గుడుంబా తయారు చేయడం జీవనోపాధిగా మార్చుకున్నారు. గుడుంబా తక్కువ ధరకు దొరకడంతో అధిక శాతం గిరిజనులే బానిసవుతున్నారు.

మండలంలో 50 శాతానికి పైగా గిరిజనులే ఉన్నారు. వీరు గుడుంబాను తాగి అనారోగ్యం పాలవుతున్నారు. గుడుంబా తయారీలో నల్లబెల్లం, పటిక, అమోనియం, జీడి గింజలు తదితర పదార్థాలను ఉపయోగిస్తారు. మోతాదుకు మించి పటిక, అమోనియం వేయడంతో తాగిన వారికి క్షణాల్లోనే నిశా వచ్చి మత్తు బారిన పడుతున్నారు. దీన్ని తాగి అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇది గమనించిన గ్రామాల యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎలాగైన తమ గ్రామాల్లో గుడుంబాను నిర్మూలిస్తామని కంకణం కట్టుకున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి రాకుండా నిఘా..

గుడుంబా నిర్మూలనకు కొన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రజలతో గుడుంబా తయారీ, విక్రయాలు జరపవద్దని ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. గుడుంబాను తమ గ్రామాల్లో ఎవరు కూడా తయారు చేయవద్దని, అమ్మవద్దని, అమ్మితే రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు పట్టిస్తామని చెబుతున్నారు. అలాగే గ్రామాల్లోకి ఇతర ప్రాంతాల నుంచి గుడుంబా రాకుండా నిఘా ఏర్పాటు చేస్తున్నారు. గుడుంబా తయారు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఓ కంట కనిపెడుతున్నారు. దీంతో గుడుంబా వ్యాపారుల్లో ఒక్కసారిగా దడ మొదలైంది. అధికారుల కళ్లుగప్పి ఏదో ఒక సమయంలో అమ్మకాలు జరపవచ్చు కానీ గ్రామాల్లోని యువకుల కళ్లుకప్పి అమ్మకాలు జరప డం కష్టమని గుడుంబా తయారీదారులు ఆందోళన చెందుతున్నారు.

25 రోజుల నుంచి మండలంలోని వివిధ గ్రామాల యువకులు గుడుంబా నిర్మూలనకు కార్యచరణ చేస్తుండడంతో గుడుంబా అమ్మకాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగానే యువకులు ఎల్లప్పుడూ గుడుంబా నిర్మూలనకు కృషి చేస్తే కొన్ని రోజుల తర్వాత గుడుంబా కనుమరుగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మండలంలో గుడుంబా నిర్మూలనకు యువకులు చేస్తున్న కృషికి పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సహాయ సహకారాలు అందించినట్లయితే గుడుంబా అమ్మకాలు ఇంకా తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


నాగారంలో గుడుంబా నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు, ప్రజలు(ఫైల్)

గుడుంబా నిర్మూలనకు కృషి చేస్తున్నాం

కొండగొర్ల బాపు, సుంపుటం మాజీ సర్పంచ్



తమ గ్రామంలో అధిక మొత్తం లో గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయి. గుడుం బా తాగి నిరుపేదలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీంతో గుడుంబాను నిర్మూలించేందుకు గ్రామంలోని ప్రజలు, యువకులను సమావేశపరిచి గుడుంబా నిషేధంపై తీర్మానం చేశాం. గ్రామంలో గుడుంబా నిర్మూలించేందుకు పోలీసు, ఎక్సైజ్ అధికారులు తమకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

యువకుల సహకారంతో పూర్తిగా నిర్మూలిస్తాం

హరి, ఎక్సైజ్ సీఐ, చెన్నూరు

గ్రామాల్లోని యువకుల సహకారంతో గుడుంబాను పూర్తిగా నిర్మూలించేందుకు మరింత కృషి చేస్తాం. యువకులకు తాము అండగా ఉంటాం. గుడుంబా నిషేధిస్తూ గ్రామాల్లో తీర్మానాలు చేయడం అభినందనీయం. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. గుడుంబా స్థావరాలపై నిత్యం దాడులు చేస్తాం. గుడుంబా తయారుచేసే వారు మానివేసి ఇతర పనులను చూసుకుని జీవనోపాధి పొందాలి. ప్రజలు గుడుంబాకు బానిస కావద్దు.

డీసీసీ అధ్యక్ష పదవికి పోటాపోటీ

(5వ పేజీ తరువాయి)



ప్రముఖ న్యాయవాది సిరిపురం రాజేశ్ పేరు తెరపైకి వచ్చింది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు సన్నిహితుడైన సిరిపురం రాజేశ్ ఓసీ కేటాగిరి కింద దరఖాస్తు చేసుకున్నారు. ప్రేంసాగర్‌రావుతో విబేధించి, దూరంగా ఉంటున్న ఓసీ కేటగిరికే చెందిన సీనియర్ నాయకుడు కేవీ ప్రతాప్ డీసీసీ పదవికి దరఖాస్తు చేసుకోవడంతో, అదే సామాజిక వర్గానికి చెందిన సిరిపురం ఆయనపై పోటీగా రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే చెన్నూరు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, పిన్నింటి రఘునాథరెడ్డి, నూకల రమేష్, బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి కారుకూరి రాంచందర్ తదితరులు ఉన్నారు.

● **షార్ట్ లిస్టులో పలువురి పేర్లు...**

ఏఐసీసీ పరిశీలకులు గత నెల 16 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలో ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా, వివిధ సెగ్మెంట్ల పరిధిలోని ముఖ్య నాయకులు ఒక్కొక్కరితోనూ ప్రత్యేకంగా మాట్లాడి అభిప్రాయాలను సేకరించారు. పరిశీలకులు స్వీకరించిన మొత్తం దరఖాస్తుల్లో ఆరుగురిని షార్ట్ లిస్టు కింద ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే షార్ట్‌లిస్టులో పేర్లున్నట్లు భావిస్తున్న నాయకులు తమ పైరవీలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర నాయకత్వంతోపాటు ఎమ్మెల్యేలు, మంత్రులతోపాటు ఢిల్లీస్థాయిలో తమ పలుకుబడిని ఉపయోగించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. షార్ట్ లిస్టులో మంచిర్యాల నియోజకవర్గం నుంచి ముగ్గురు, చెన్నూరు నియోజకవర్గం నుంచి ఇద్దరు, బెల్లంపల్లి నుంచి ఒక్కరి పేర్లు ఉన్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. అయితే ప్రస్తుతం ఏఐసీసీ పెద్దల దృష్టి అంతా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలపై ఉండగా, ఆ ప్రక్రియ ముగిసిన తరువాతనే షార్ట్‌లిస్టును పరిశీలించే అవకాశాలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

శ్రీయంత్రం అందజేత


శ్రీయంత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుడు శ్యామ్

జైపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జైపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు శ్యామ్ బుధవారం జైపూర్‌లోని భూనీలసమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి 10వేల రూపాయల విలువ గల లక్ష్మీదేవి స్వరూపం అయిన శ్రీయంత్రాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు అరవిందరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రదీప్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకుడు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో పేకాట

-హెడ్ కానిస్టేబుల్, మరో ఐదుగురు కానిస్టేబుళ్ల నిర్వాకం

చెన్నూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్‌ను పేకాట క్లబ్‌గా మార్చి గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న చెన్నూరు ఎక్సైజ్ కానిస్టేబుళ్ల నిర్వాకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి ఎక్సైజ్ స్టేషన్‌ను మూసివేసి ఓ హెడ్ కానిస్టేబుల్‌తో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు పేకాట ఆడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించే బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తున్న వారే ఇలా పేకాట ఆడడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసినా చూసీచూడనట్లుగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ స్టేషన్‌ను పేకాట క్లబ్‌గా మార్చిన సిబ్బందిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై చెన్నూరు ఎక్సైజ్ సీఐ హరిని వివరణ కోరగా విచారణ నిర్వహించి ఎక్సైజ్ స్టేషన్‌లో పేకాట ఆడుతున్న సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు రమణారెడ్డి వర్ధంతి

తాండూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌లోని భగత్‌సింగ్ భవన్‌లో దాసరి రమణారెడ్డి వర్ధంతి సభ గురువారం ఉంటుందని సీపీఐ మండల కార్యదర్శి కొండు బానేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

మత్తడికి మరమ్మతులు చేయరా?


చెరువు మత్తడి అడ్డుగోడ నుంచి నుంచి లీకవుతున్న నీరు

జైపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం, రామారావుపేట గ్రామాలకు జీవనాధారమైన రామారావుపేట చెరువుకు ఆదరణ కరువైంది. వంద ఎకరాల్లో నిర్మించిన చెరువు కావడంతో ఈ చెరువు కింద సుమారు 800 ఎకరాల్లో పంటలను రెండు గ్రామాల రైతులు సాగు చేస్తున్నారు. రామారావుపేట శివారులో ఉన్న మత్తడి బలహీనంగా మారడంతో నీరు వృథాగా వాగులో కలుస్తోంది. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేస్తే ఎండాకాలంలో చెరువులో నీరుండే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం లీకేజీ వల్ల నీరు వృథాగా పోతుందని రైతులు వాపోతున్నారు. ఈనీటితో ఎండాకాలంలో రెండు తడులకు నీరందించే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా మదన పోచమ్మ జాతర ప్రారంభం

కోటపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనగామ గ్రామంలో మదన పోచమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజున భక్తులంతా కాలినడకన ఎర్రాయిపేట గోదావరి తీరా నికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. జనగామ, సూపాక, పుల్లగామ, ఆల్గామ, ఏదులబంధం , లింగన్నపేట, సిర్సా తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పల్లకి వెంట గోదావరి తీరానికి చేరుకున్నారు. గోదావరిలో అమ్మవారి విగ్రహాలకు జలాభిషేకాలు నిర్వహించి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా ఈనెల 8న అమ్మవారి రథయాత్ర, 9న బోనాల సమర్పణ నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యుడు, తాజామాజీ సర్పంచు గట్టు లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు.


గోదావరి ఒడ్డున పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తజన సంద్రంగా గూడెం గుట్ట

- వైభవంగా కార్తీక పౌర్ణమి మహా జాతర

(5వ పేజీ తరువాయి..)


పర్యవేక్షిస్తున్న ఏసీపీ ప్రకాష్, సీఐ రమణమూర్తి

కార్తీక వ్రతాలను ఆచరించి, సత్యదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. జగిత్యాల జిల్లా అదనపు న్యాయమూర్తి నారాయణ, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఏసీపీ ప్రకాష్ సత్యదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు.

● **సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు**

సత్యనారాయణ స్వామి ఆలయంలో సుమారు 1300లకుపైగా దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. దేవస్థానం ప్రధాన ఆలయంలో, కింది వ్రత మండపం లోనే కాకుండా మరో వ్రత మండపం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తి శ్రద్ధలతో సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించారు.

● **భారీ పోలీసు బందోబస్తు**

గూడెం గుట్టపై ఎటువంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ డి రమణమూర్తి, దండేపల్లి ఎస్ఐ తహసీనోద్దీన్ ఆధ్వర్యంలో దేవాలయం, గోదావరి తీరం, ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు అధికారులు పర్యవేక్షించారు. గోదావరి తీరం వద్ద గజ ఈతగాళ్లను కూడా ఏర్పాటు చేశారు.

● **అయ్యప్ప మాలధారణ..**

గూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో సుమారు 450 మంది భక్తులు ఆలయానికి చేరుకొని ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి చక్రవర్తులు పురుషోత్తమచార్యులతో మాలధారణ స్వీకరించారు. అయ్యప్ప స్వాముల శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- దేవాలయాలకు పోటెత్తిన జనం
- దీపారాధనలు, ప్రత్యేక అర్చనలు
- నదుల్లో పుణ్యస్నానాలు చేసిన భక్తులు



చెన్నూరు శివాలయంలో, కాసిపేట మండలం సోనాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు


బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం కోనేరు వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలు చేశారు. స్థానిక విశ్వనాథాలయంలో ఉదయం నుంచే దీపారాధన, ప్రత్యేక అర్చనలు చేశారు. శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగిపోయాయి. పలువురు భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలను ఆచరించారు.

వేమనపల్లి: మండలంలోని ప్రజలు ఉదయం ఇళ్లలో పూజలు చేసి తులసీ కోటల వద్ద దీపాలను వెలిగించారు. వేమనపల్లి సరిహద్దున ప్రవహిస్తున్న ప్రాణహిత నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నదిలో దీపాలను వదిలారు. స్థానిక శివాలయంలో మహిళలు పూజలుచేసి దీపాలను వెలిగించారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్ నల్లలవాగు ఆలయం, సోనాపూర్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలను వెలిగించారు. ఆదివాసీ గిరిజనులు, గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

నస్పూర్: సీతారాంపల్లి గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులు ఇళ్ళ వద్ద తులసీ కోట వద్ద దీపాలు వెలిగించి ఆలయాలకు చేరుకుని ధ్వజ స్తంభం, రావి వృక్షం, బిల్వవృక్షం, ఉసిరి చెట్టు, నాగేంద్రుడి వద్ద ఉదయమే కార్తీక దీపాలు వెలిగించి దీప దానాలు చేశారు.

చెన్నూరు: పట్టణంలోని శివాలయం, జగన్నాథ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ప్రజలు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు దీపాలను వెలిగించారు.

కోటపల్లి: మండలంలోని ఆలయాల్లో ఉదయం కాగడ హారతి నిర్వహించడగా భక్తులు హాజరయ్యారు. మండల కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో 24 గంటల పాటు నిర్వహించే ఎక్కాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు భజన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉదయాన్నే భక్తులు దేవాలయానికి వెళ్లి శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయ ఆవరణలో భజన కార్యక్రమాలు చేపట్టారు.

జన్నారం/భీమారం/మందమర్రి రూరల్: జన్నారం, భీమారం, మందమర్రి మండలాల్లో కార్తిక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రేండ్లగూడలోని రామాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని మూడో జోన్ సీతారామాలయంలోని శివకేశావాలయం, అంగడిబజార్‌లోని శివ కేశవాలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. సాయిబాబా ఆలయం, వేంకటేశ్వరాలయంలో దీపాలంకరణ చేశారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో జ్వాలాతోరణ పూజలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




జన్నారం మండలం రేండ్లగూడలో సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు, కోటపల్లి ఆంజనేయ స్వామి ఆలయం, బెల్లంపల్లి మండలం బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు



నేడు ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి

కబడ్డీ పోటీలు


తాండూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న మండలంలోని అచ్చలాపూర్‌లో గల జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో అండర్ 17 బాలికల ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని హెచ్ఎం ఉమాదేవి, పీఈటీ సాంబ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 15న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో ఎంపికైన విద్యార్థినులు మాత్రమే పోటీలకు అర్హులని తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మందమర్రిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి సారంగపల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, వేగంగా, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి

పోటాపోటీ



- రోజు రోజుకూ పెరుగుతున్న ఆశావహుల సంఖ్య
- షార్ట్ లిస్టులో పేర్ల కోసం పైరవీలు
- తెరపైకి వస్తున్న కొత్త దరఖాస్తుదారుల పేర్లు

మంచిర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి కోసం విపరీతమైన పోటీ నెలకొంది. దరఖాస్తు ప్రక్రియ ముగిసినప్పటికీ, ఆ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న కొత్త వారిపేర్లు తెరపైకి వస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న విషయం కూడా గోప్యంగా ఉంచగా, ఇప్పుడిప్పుడే ఆశావహుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. దీంతో డీసీసీ పదవికి ఉన్న డిమాండ్‌పై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొనగా, అది ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ నాయకుల్లో నెలకొంది. ఏఐసీసీ పరిశీలకులు జిల్లాలో పర్యటించడం, మూడురోజుల పాటు స్థానికంగా ఉండి దరఖాస్తులు స్వీకరించడంతోపాటు పార్టీకి చెందిన ముఖ్యనేతల అభిప్రాయాలు కూడా తీసుకున్నారు. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రంలో పదవుల నియామకం చేపట్టనుండగా, ఎన్నడూ లేని విధంగా కొత్తగా దరఖాస్తు ప్రక్రియకు తెరతీయడంతో ఢిల్లీలో అసలు ఏం జరుగుతుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది.

29 మంది దరఖాస్తు....

డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లా నుంచి ఏకంగా 29 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఇందులో సీనియర్లు, గతంలో వివిధ పదవులను అలంకరించిన వారితోపాటు కొత్తవారు కూడా ఉన్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి సెగ్మెంట్ల పరిధిలో ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేల సూచనలతో వారంతా దరఖాస్తు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొంతమంది ఎమ్మెల్యేలకూ సమాచారం లేకుండా దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. డీసీసీ రేసులో ఉండి దరఖాస్తు చేసుకున్న వారిలో సీనియర్లు మంచిర్యాల నియోజక వర్గం నుంచి ప్రస్తుత డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కేవీ ప్రతాప్, డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్, ముత్తినేని రవికుమార్, గడ్డం త్రిమూర్తి ఉన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన జిల్లా అధికార ప్రతినిధి..

తెరపైకి మరికొందరు..

డీసీసీ అధ్యక్షుల నియామకం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తరువాత ఉండే అవకాశం ఉంది. ఉప ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర నాయకత్వం బిజీగా ఉండటంతో అటు తరువాతనే నియామకాలు జరుగుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు దరఖాస్తులను పూర్తిస్థాయిలో స్క్రూటినీ చేసిన ఏఐసీసీ పరిశీలకులు వాటిని షార్ట్ లిస్ట్ చేసి, ఢిల్లీ పెద్దలకు అందజేశారు. దీంతో త్వరలోనే డీసీసీ అధ్యక్షుల నియామకం జరుగనుండగా, రోజురోజుకు దరఖాస్తు చేసుకున్న కొత్తవారి పేర్లు బయటకు వస్తున్నాయి. గడువులోగా గుట్టుగా దరఖాస్తు చేసుకున్నప్పటికీ, సమయం ఆసన్నమవుతుండటంతో తీవ్ర ఉత్కంఠకు గురవుతున్నవారు తాము కూడా రేసులో ఉన్నట్లు పలువురు ఆశావహులు సన్నిహితులతో చెబుతున్నట్లు తెలుస్తోంది.

మిగతా 7లో..

'అమ్మకు అక్షరమాల'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం

జైపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తం పేర్కొన్నారు. బుధవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఓబీ, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించడానికి వలంటరీ టీచర్లను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశామన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి గ్రామసంఘం నుంచి ఇద్దరు ఓబీలకు, వీవోఏలకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఓబీలకు, వీవోఏలకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనిత, మండల సమాఖ్య అధ్యక్షురాలు మాలతి తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌ల తనిఖీ



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ఉమ్మడి జిల్లా అంబులెన్స్‌ల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్

వేమనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్ వాహనాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంబులెన్స్‌ల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ వాహనం పనితీరును, వాహనంలో ఉన్న వైద్య పరికరాలను పరిశీలించారు. అత్యవసర సమయాల్లో వినియోగించే మెడికల్ ఎక్విప్‌మెంట్ మందులను తనిఖీ చేశారు. బాధితులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రమాదం జరిగిన వారికి, గర్భిణులకు అవసరమైన సమయంలో వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవాలన్నారు. అలాగే ఇటీవల అంబులెన్స్ వాహనంలో సుఖ ప్రసవం చేసిన స్థానిక సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అంబులెన్స్ వాహనాల కార్యనిర్వహణ అధికారి సంపత్, స్థానిక 108 ఈఎంటీ జాడి స్వరూప, పైలెట్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న అధికారులు

హాజీపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను బుధవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలో మండలానికి సంబంధించిన ధోనబండ, రాపల్లి, హాజీపూర్ మత్స్యసహకార సంఘాలకు ఒక లక్ష రెండు వేల చేపపిల్లలు పంపిణీ చేసినట్లు ఫిషరీస్ అసిస్టెంట్ శ్రవణ్ కుమార్ తెలిపారు. మండలంలోని ముల్కల్ల, గుడిపేట్, గద్పూర్‌లకు చెందిన మత్స్య సహకార సొసైటీలకు మరో మూడు లక్షల పదివేల చేప పిల్లలను త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హాజీపూర్ ఎఫ్‌పీసీ చైర్మన్ పుస్కూరి శ్రీనివాస్‌రావు, ఏఈవో మౌనిక, మత్స్య సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీ టీంలు

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతుల రక్షణ కోసమే షీటీం ఉందని, వేధింపులపై మౌనంగా ఉండవద్దని, ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకనలో తెలిపారు. మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని, కమిషనరేట్ పరిధిలో రెండు షీటీం బృందాలు పని చేస్తున్నాయన్నారు.

ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో కేసు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్య వచ్చినప్పుడు 100కు డయల్ చేస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. టీ సేఫ్ యాప్, మహిళల భద్రత, రక్షణ చర్యలు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్య పరుస్తున్నామని వివరించారు. సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, లేదా ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్, వాట్సాప్ ద్వారా కూడా స్వీకరిస్తామన్నారు. మహిళలు, బాలికలపై అసభ్యకర పోస్టులు పెట్టేవారు, సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్ షీటీం సమన్వయంతో పని చేస్తున్నాయని, దీని కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థులు షీటీం సేవలను వినియోగించుకోవాలని కోరారు. మంచి ర్యాల జోన్ పరిధిలోని వారు 8712659386 నంబర్‌కు ఫోన్‌ద్వారా కానీ, వాట్సాప్ ద్వారా కానీ సందేశం పంపిస్తే తక్షణమే పోలీసుల సహాయం అందుతుందని చెప్పారు. షీటీంలకు 69 ఫిర్యాదులు అందగా 12 ఫిర్యాదులు నేరుగా అందాయన్నారు. 57 కేసుల్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు.

రెడ్‌హ్యాండెడ్ కేసుల్లో ఆరు పెట్టి, ఎనిమిది కౌన్సెలింగ్‌లు, 43 హెచ్చరించి కౌన్సెలింగ్ నిర్వహించామని వివరించారు. అక్టోబరులో మంచి ర్యాల జిల్లాలో 25 అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామన్నారు. అక్టోబరులో మంచిర్యాల పరిధిలో 126 హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తిం చామని తెలిపారు. పోలీసులు ప్రజల కోసమే పని చేస్తారని, మహిళలు, విద్యార్థులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి శివతో పాటు బాబురావు

కాసిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి శివ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబురావు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన 500 మీటర్లు, ఆరు కిలో మీటర్లపరుగు పందెంలో శివ మెరుగైన ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచాడన్నారు. ఈ నెలాఖరులో హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. శివను కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, డీఐఈవో అంజయ్య, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థినితో ప్రిన్సిపాల్, పీఈటీలు

లక్సెట్టిపేట, నవంబరు, 5(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంకు చెందిన ప్రవళిక అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమాకళ్యాణి బుధవారం తెలిపారు. ఇటీవల మహ బూబ్ నగర్ జిల్లా నెల్లికుదురులో నిర్వహించిన 44వజూనియర్ విభాగం షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు ప్రిన్సి పల్ తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన హనీష అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. గత నెల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో హనీష జిలాస్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు ఈనెల 7వ తేదీ నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినులతోపాటు పీఈటీ రమాదేవి, మమతలను అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేంత వరకు బంద్



ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేస్తున్న ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య సభ్యులు

మంచిర్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేంత వరకు విద్యాసంస్థల నిరవధిక సమ్మె ఆపేది లేదని ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య సభ్యులు అన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అందుబాటులో లేకపోవడంతో ఆయన పీఏకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బకాయిలను చెల్లించేంత వరకు విద్యాసంస్థల బంద్ ఆపేది లేదని హెచ్చరించారు. కళాశాల కరస్పాండెంట్ నర్సయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రమణ, శ్రీనివాస్‌రాజ్‌పాల్గొన్నారు.

బ్యాగులు పంపిణీ

మందమర్రిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిర్రగుంట గ్రామంలో బుధవారం రేషన్ షాపు వద్ద ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యంతో పాటు బ్యాగులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. నాయకుడు గందె రాంచందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలయ్య, రాజయ్య, సంపత్‌రావు, రాములు, సుధాకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెక్‌పోస్టు ఏర్పాటు



కామన్‌పల్లి వద్ద చెక్‌పోస్టు ప్రారంభిస్తున్న ఎఫ్‌డీవో రామ్మోహన్

జన్నారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కవాల్ టైగర్‌జోన్‌లోని అటవీ ప్రాంతం నుంచి కలప అక్రమ నిరోధానికి కామన్‌పల్లి గ్రామం వద్ద అటవీ చెక్‌పోస్టును ఎఫ్‌డీవో రామ్మోహన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవ్వాల్ అటవీ ప్రాంతం నుంచి కలప అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలప అక్రమ రవాణా చేసినా, వన్యప్రాణులకు హాని కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు లక్ష్మీనారాయణ, అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కన్నెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి ఫీడర్‌లో మెయిం టనెన్స్ పనుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుం దని విద్యుత్ డీఈ రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. భీమిని, కన్నెపల్లి, నాయకునిపేట, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా..

- నడుం బిగించిన యువకులు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు, ప్రతిజ్ఞలు
- తగ్గుముఖం పడుతున్న అమ్మకాలు

7

భక్తజన సంద్రంగా గూడెం గుట్ట

- వైభవంగా కార్తీక పౌర్ణమి మహా జాతర
- సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు
- తరలివచ్చిన భక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు

దండేపల్లి నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానంలో బుధవారం కార్తీక పౌర్ణమి మహాజాతర కన్నుల పండువగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలో నలుమూలల నుంచి ఉదయం నుంచి భక్తులు కుటుంబ సమేతంగా దేవస్థానానికి తరలివచ్చి సత్యదేవుడిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తజనంతో నిండింది. ముందుగా గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించి, కార్తీక దీపారాధన చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో గుట్ట కింద నుంచి ఘాట్‌రోడ్డు ద్వారా భక్తులు వెళ్లే మార్గంలో షామియానాలు, చల్లని తాగునీరు ఏర్పాటు చేశారు. భక్తులు దర్శనానికి ఇబ్బంది కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వేద పండితులు, అర్చకులు స్వామి వారికి నిత్య అభిషేకాలు, పంచామృత అభిషేకం, మహాహారతి, మంత్ర పుష్పం, మహాపూర్ణాహుతి నిర్వహించారు.



సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



స్వామి వారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

మొక్కులు చెల్లించుకున్న భక్తజనం

మహిళలు భక్తిశ్రద్ధలతో దేవాలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. సత్యనారాయణస్వామి, అయ్యప్పస్వామి, సాయిబాబా తదితర ఆలయాలను సందర్శించి కార్తీక ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ప్రాంగణంలో రాగి చెట్టు వద్ద భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



సత్యదేవుడిని దర్శించుకున్న ప్రముఖులు..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గూడెం దేవాలయంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు దంపతులు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ దంపతులు..

(మిగతా 7లో..)









రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, భక్తులు, గూడెం ఆలయం వద్ద భక్తుల సందడి, సత్యదేవుడి దర్శనం కోసం వస్తున్న భక్తులు, గోదావరి నదిలో కార్తీకదీపాలను వదులుతున్న భక్తులు